నుమాయిష్‌లో హెల్త్ సెంటర్ ప్రారంభం

హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైద్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు సంజీవ్ కుమార్, డాక్టర్ లింగయ్య, డాక్టర్ వంశీ తిలక్

అబిడ్స్, జనవరి 17 : నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సందర్శకుల కోసం హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ అన్నారు. నుమాయిష్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి సంవత్సరం హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కన్వీనర్ డాక్టర్ సంజీవ్ కుమార్, యశోద దవాఖాన మెడికల్ డైరెక్టర్ డాక్టర్ లింగయ్య, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు డాక్టర్ వంశీ తిలక్, డాక్టర్ జీఎస్, శ్రీనివాస్, డాక్టర్ ఎస్. రాజేందర్, డాక్టర్ వెంకట ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

సన్మానం

హైకోర్టు నూతన జడ్జిగా నియమితులైన రేణుకాయారాను శుక్రవారం తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ స్పెషల్ సభ్యుడు పి.రామారావు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

– మెహిదీపట్నం, జనవరి 17

రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ దర్శన్

కార్వాన్, జనవరి17 : జియాగూడ డివిజన్‌లో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. భరత్ నగర్‌లో రూ. 43 లక్షల నిధులతో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జియాగూడ డివిజన్ ప్రజలకు అవసరమైన మంచినీరు, వీధి దీపాలు, సీసీ రోడ్లు వంటి మౌలిక సదుపాయా కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేందర్ డిగాన్, మనీష్ జైన్, మురళి, నర్సింగ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, క్రిష్ణ, నాగరాజ్, వీరు, పృథ్వీరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటను అగ్రభాగంలో నిలిపా

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

కార్పొరేటర్ అమృతతో కలిసి కంపౌండ్‌వాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జనవరి 17: అంబర్‌పేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అగ్రభాగంలో నిలిపానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్ టీఆర్టీ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న కంపౌండ్‌వాల్ నిర్మాణం, టెన్నిస్ కోర్టును డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీలో పర్యటించి కాలనీ వాసుల సమస్యలను తెలుసుకున్నారు. మణెమ్మ పార్కులో చెత్తాచెదారం పేరుకుపోయిందని చెప్పగా, హార్టికల్చర్ అధికారులను పిలిచి వెంటనే చెత్తను తొలగింపజేయాలని ఆదేశించారు. పార్కును పరిశుభ్రంగా ఉంచాలని ఆయన చెప్పారు. కాలనీలో పారిశుధ్య నిర్వహణ సరిగా ఉండాలని చెప్పారు. కాలనీవాసుల కోరిక మేరకు పార్కుల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, సీనియర్ నాయకుడు భాస్కర్‌గౌడ్, నరేందర్, విజయేంద్రసాగర్, వెంకటేశ్‌గౌడ్, నరేశ్, భూపతినాథ్, శ్రీనివాస్, స్వప్న, వన్నాడి రమ్య, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ప్రశాంత్ జోషి, మహేశ్, ఎస్. నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిసనర్ సరిత

నిష్పక్షపాతంగా కార్డుల సర్వే

చార్మినార్, జనవరి 17 : చార్మినార్ సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే నిష్పక్షపాతంగా కొనసాగుతుందని చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో సర్వేపై మాట్లాడుతూ.. చార్మినార్ సర్కిల్ పరిధిలో రేషన్ కార్డుల కోసం 16,71 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. అందులో ఇప్పటికే సర్వే పూర్తి కావచ్చిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకోసం కలెక్టర్ కార్యలయం నుంచి 17,161దరఖాస్తులు అందినట్లు ఆమె తెలిపారు. అందులో ఇప్పటి వరకు 52 శాతం పూర్తిస్థాయిలో సర్వే ముగిసిందన్నారు. నిర్ధిష్ట సమయంలోగా సర్వే పూర్తి చేసి వార్డు కార్యలయాల్లో ప్రజలకు వివరాలను అందుబాటులో పెడతామన్నారు.. ఇందిరమ్మ ఇండ్ల కోసం జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల నుంచి 58 మంది ఎన్యుమరేటర్లను నియమించి సర్వేను కొనసాగిస్తున్నామని తెలిపారు. సర్వే కోసం వచ్చే సిబ్బందిలో ఎవరైనా ఇండ్లు ఇప్పిస్తామని.. ఇండ్లు వచ్చే విధంగా సహకరిస్తామని ప్రచారం చేసుకుంటూ డబ్బులు డిమాండ్ చేస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

మల్లేపల్లిలో..

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్‌లో జీహెచ్ఎంసీ సర్కిల్ –12 అధికారులు శుక్రవారం రేషన్ కార్డుల కోసం సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డులు లేని వారి వివరాలు సేకరించారు. – మెహిదీపట్నం, జనవరి 17

ల్యాప్‌ట్యాప్ దొంగ రిమాండ్

వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ జావేద్, రైల్వే సీఐ ఎల్లప్ప

కాచిగూడ,జనవరి 17: రద్దీగా ఉన్న రైళ్లను ఎంచుకొని దొంగతనాలకు పాల్పడుతున్న యువకున్ని కాచిగూడ రైల్వేపోలీసులు అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్ జావేద్, కాచిగూడ రైల్వే ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. కర్ణాటకలోని మాలూరు గ్రామానికి చెందిన డీకే నవీన్‌కుమార్ డిసెంబర్ 21వ తేదీన అకోలా రైల్లో వెళ్తుండగా కాచిగూడ రైల్వేస్టేషన్‌లో బ్యాగులోంచి ఖరీదైన ల్యాప్‌ట్యాప్‌ను దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు శుక్రవారం కాచిగూడ రైల్వేస్టేషన్‌లో నవీన్‌కుమార్ అనుమానాస్పదంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకొని విచారించగా చేసిన దొంగతనం ఒప్పుకున్నాడు. కొన్ని నెలల క్రితం రైల్లో ప్రయాణిస్తుండగా తన ఫోన్‌ను దొంగిలించారని, ఇప్పటి వరకు ఆ ఫోన్ అచూకీ లభించలేదని, అందుకు నేను ఈ దొంగతనం చేసినట్లు నిందితుడు తెలిపినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు. ఆతని నుంచి రూ.80 వేల విలువ చేసే ఖరీదైన ల్యాప్‌ట్యాప్, పవర్‌బ్యాంక్, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకొని శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు రైల్వే సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్స్ బీజీ ప్రసాద్‌రావు, చిన్నానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తుల విచారణ

రేషన్ కార్డు దరఖాస్తుదారుల విచారణ కొనసాగుతోంది. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని ఆరు మున్సిపల్ డివిజన్‌లలో ఏర్పాటు చేసిన విచారణ బృందం విచారణ చేపడుతున్నారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ నుంచి మొత్తం ముగ్గురు సిబ్బంది టీమ్‌గా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి విచారణ చేపడుతున్నారు. నాంపల్లి తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ విచారణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీన ప్రారంభమైన విచారణ 20వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. విచారణ పూర్తైన తరువాత 26వ తేదీన రేషన్ కార్డులను జారీ చేయనున్నట్లు వివరించారు.

– అబిడ్స్, జనవరి 17

బీఆర్ఎస్ నాయకుల అరెస్ట్..

కార్వాన్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

కార్వాన్, జనవరి 17 : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమం పూర్తిగా మరుగునపడిందని కార్వాన్ నియోకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్ సింగ్ అన్నారు. బీఆర్ఎస్ అగ్ర నాయకుల అక్రమ అరెస్టులను నిరసిస్తూ శుక్రవారం గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ పాలక మండలి ప్రమాణ స్వీకారానికి వస్తున్న మంత్రులకు మెమోరాండం సమర్పించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు దారిలోనే అరెస్టు చేసి టప్పాచబుత్రా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని ఇపుడు వారి నిజ స్వరూపం బయటపడిందని అన్నారు. కేవలం కక్ష్య పూరిత రాజకీయాలను కాంగ్రెస్ ప్రభత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అరెస్టైన బీఆర్ఎస్ నాయకులు కోడూరు శ్రీధర్ సాగర్, అంబటి శ్రీనివాస్, దీపక్, సోమాచారి తదితరులు ఉన్నారు.

కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకులు..

విడుదలైన నాయకులను సన్మానించిన కార్వాన్ కాంగ్రెస్ నాయకులు

కార్వాన్, జనవరి17 : గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ పాలక మండలిలో తమకు స్థానం కల్పించలేదంటూ కార్వాన్ నియోజకవర్గానికి చెందిన నాయకులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ శుక్రవారం నాటి ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకుంటాం అనడంతో శుక్రవారం తెల్లవారు జాము నుండే కార్వాన్ నియోజకవర్గంలోని కార్వాన్, గుడిమల్కాపూర్, జియాగుడా, లంగర్‌హౌస్ డివిజన్లకు చెందిన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అరెస్టైన వారిలో శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, మాధవి, చంటిబాబు, సంతోష్, పరమానందం, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. అరెస్ట్ చేసిన నాయకులను సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం హయాంలో తమనే అరెస్టు చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ మార్కెట్ పాలక మండలి నియామకంలో నిబంధనలను పాటించకుంగా ఏర్పాటు చేసి స్థానికులకు అన్యాయం చేశారన్నారు.

సెన్సార్‌బోర్డు అడ్వైజరీ ప్యానల్ మెంబర్‌గా రాకేశ్‌జైస్వాల్

అబిడ్స్, జనవరి 17 : సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ హైదరాబాద్ అడ్వైజరీ ప్యానల్ మెంబర్‌గా జాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ నియమితులయ్యారు. ఈ మేరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ రీజినల్ ఆఫీసర్ షిఫాలికుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగేలా రాకేశ్‌జైస్వాల్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తనను సెన్సార్ బోర్డు సభ్యులుగా నియమించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పదవికి వన్నె తీసుకు వచ్చేలా పని చేస్తానని తెలిపారు.

చేపలు తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు

నుమాయిష్‌లో ఏర్పాటు చేసిన ఫిషరీస్ ఫెడరేషన్ ఫిష్ ఫుడ్‌కోర్టును ప్రారంభిస్తున్న చైర్మన్ మెట్టు సాయికుమార్

అబిడ్స్, జనవరి 17 : చేప వంటకాలు తినడం వలన ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న నుమాయిష్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ ఫిష్ ఫుడ్‌కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ.. ఈ స్టాల్‌లో 20 రకాల చేపల వంటకాలను తయారు చేసి అందజేస్తున్నామన్నారు. చేప వంటకాలు రుచి చూసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఫుడ్ కోర్టు నిర్వాహకులను అభినందించి అందుబాటులో ఉంచిన చేప వంటకాలను ఆయన రుచి చూసి ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో బేగంబజార్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన

ప్రజలు రోడ్లపై ప్రమాదాల బారిన పడకుండా వాహనాలను సక్రమంగా నడపాలని, ముఖ్యంగా ట్రాఫిక్ నియమనిబంధనలను పాటించి భద్రతలో భాగస్వాములు కావాలని లంగర్‌హౌస్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య అన్నారు. శుక్రవారం మెహిదీపట్నం రేతిబౌలి సమీపంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత ఉత్సవాలు ఎందుకు జరుపుకుంటున్నామో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, వాహనాలను నడిపే సమయంలో అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించాలని ఆయన సూచించారు.

– మెహిదీపట్నం, జనవరి 17

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, జనవరి 17: పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (40)శుక్రవారం ఉప్పుగూడ– యాకుత్‌పుర రైల్వేస్టేషన్‌ల మధ్య పట్టాలు దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతుని ఒంటిపై ఆకుపచ్చ రంగు చొక్క, నలుపు రంగు జీన్స్ ధరించి, ఎత్తు 5.4 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 9948695948లో సంప్రదించాలని కోరారు.

గంజాయి విక్రేతల అరెస్టు

గంజాయి విక్రేతలను అరెస్టు చేసిన ఎక్సైజ్ పోలీసులు

కవాడిగూడ, జనవరి 17: ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ముషీరాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దోమలగూడ ధోబీఘాట్ ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు గంజాయి విక్రయిస్తుండగా ఎస్టీఎఫ్టీ టీమ్, ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. మౌలాలికి చెందిన యశ్వంత్, రామంతాపూర్‌కు చెందిన వంశీకృష్ణను పట్టుకుని తనిఖీచేయగా 1కిలో 76గ్రాముల గంజాయి దొరికిందని ఎస్ఐ జ్యోతి తెలిపారు. నిందితుల నుంచి గంజాయితోపాటు ద్విచక్రవాహనం, రెండు ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

గుడిమల్కాపూర్ మార్కెట్ పాలక మండలి ప్రమాణ స్వీకారం

గుడిమల్కాపూర్ మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించిన వ్యవసాయ మార్కెట్ పాలక మండలి ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

కార్వాన్, జనవరి17 : గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ అభివృద్ధి కోసం తన శాయ శక్తులా పాటు పడతానని గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ పాలక మండలి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తలారి మల్లేశ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నూతనంగా ఏర్పడిన గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ పాలక మండలి శుక్రవారం మార్కెట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని చైర్మన్‌గా తలారి మల్లేశ్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డైరెక్టర్ మునీర్‌తో పాటు మొత్తం 14 మంది సభ్యుల చేత మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా మల్లేశ్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో రైతులు, వినియోగదారులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. రైతులు, వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎమ్మెల్సీ, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ నెల 26 నుంచి ప్రతి ఎకరాకు ఆరు వేల చొప్పున రైతు భరోసా అంద జేస్తామని, అదే విధంగా ఇందిరమ్మ ఇండ్లు, అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వంపై భారం ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్, ఎమ్మెల్యేలు శ్రీహరి ముదిరాజ్, శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఫెరోజ్‌ఖాన్, మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, డైరెక్టర్ మునీర్, తూముకుంట అరుణ్‌కుమార్, శ్రీహరి ముదిరాజ్, యాదయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ఐవీఎఫ్.. కలలను సాకారం చేస్తున్న సాఫల్య కేంద్రం

జాగ్రత్తలు తెలియజేస్తున్న సూపరింటెండెంట్ రజినిరెడ్డి

చార్మినార్, జనవరి 17 : సంతానం లేని నిరుపేదలకు ప్రభుత్వ వైద్యాసుపత్రిలో ఐవీఎఫ్ ద్వారా భార్యభర్తల కళలను నిజం చేస్తున్నామని మోడ్రన్ మెటర్నటీ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రజినిరెడ్డి తెలిపారు. గత డిసెంబర్ నెల 9వ తేదీన ఆస్పత్రిలో ప్రారంభించిన సంతాన సాఫల్య కేంద్రం ద్వారా బిడ్డలు లేని ఎంతోమంది ఆశలను నెరవేర్చడానికి ప్రయత్నంలో భాగంగా విజయం సాధించామని తెలిపారు. ఆస్పతిలో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ ద్వారా గత నెల 5 గురికి, జనవరిలో ఇప్పటి వరకు మరో 5 గురికి గర్భధారణ చేశామని వెల్లడించారు. శుక్రవారం ఆస్పత్రిలో గర్భధారణ జరిగిన మహిళలకు ప్రత్యేకంగా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తూ సమావేశాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ.. ఐవీఎఫ్ కేంద్రంలో ఇప్పటిరకు సుమారు 320 మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిలో ఇప్పటి వరకు 10 మంది మహిళలకు గర్భధారణ జరిగిందని తెలిపారు. వివిధ కారణాల వల్ల సంతానం కలగని దంపతులు ఆస్పత్రిలో వారి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. వారి పూర్వ వైద్య చరిత్రను పరిశీలించిన అనంతరం యోగ్యమైన వారికి వారి ఆశలను తీర్చడానికి ఐవీఎఫ్ చికిత్స ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో లక్షలాది రూపాయలు ఖర్చు చేసే ఈ విధానం ప్రభుత్వ మోడ్రన్ ప్రసూతి ఆస్పత్రిలో ఉచితంగా లభిస్తుందని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ అమృతలక్ష్మి తో పాటు పలువురు పేషంట్లు పాల్గొన్నారు.

మార్కెట్‌లో వసతులు మెరుగు పరుస్తాం

గుడిమల్కాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన మునీర్‌ను మహేశ్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు పట్నం సుబ్బారావుతో పాటు ప్రశాంత్, రఘు, సాగర్, గురు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా మునీర్ మాట్లాడుతూ.. మార్కెట్‌కు వచ్చే వారికి అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు.

– అబిడ్స్, జనవరి 17

ప్రజల అభివృద్ధికి పాటుపడాలి

ప్రజల సమస్యలు తెలుసుకుని వారి అభివృద్ధి కోసం పార్టీ నాయకులు,కార్యకర్తలు పాటుపడాలని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. శుక్రవారం కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్ అమర్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. ఈ సందర్భంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ కాలనీలలో ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలని అన్నారు.

– మెహిదీపట్నం, జనవరి 17

అన్నదానం

పాట్కూరి అశోక్ ఆధ్వర్యంలో చెప్పల్‌బజార్‌లో జీహెచ్ఎంసీ కార్మికులకు బ్లాంకెట్స్ పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ కార్పొరేటర్ ఎక్కాల చైతన్య విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎక్కాల కన్నా, పాట్కూరి శ్రీనివాస్, వినోద్‌కుమార్, సాగర్, శివాజీ పాల్గొన్నారు.

– కాచిగూడ,జనవరి 17

రోడ్లపై మత పరమైన నిర్మాణాలు తొలగించాలి

సమావేశంలో మాట్లాడుతున్న భూపతి వెంకటేశ్వర్లు

చిక్కడపల్లి, జనవరి 17: నగరంలో రోడ్లపై ఉన్న మత పరమైన నిర్మాణాలను తొలగించాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం (టీపీఎస్‌కే), తెలంగాణ సిటిజన్స్ రైట్స్ అసోసియేషన్ సంయుక్తంగా శుక్రవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 533 గుడి, మసీదు, చర్చిలు, రోడ్లకు ఆటకంగా ఉన్నాయని వీటిని తొలగించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా జీహెచ్ఎంసీ 26 మాత్రమే తొలగించిందని తెలిపారు. 114 శ్మశానవాటికలు, 357 రోడ్ల ఆక్రమణకు గురైనాయని, ఓటు బ్యాంకు రాజకీయాల మూలంగా ఉదాసీనత కొనసాగుతున్నదని తెలిపారు. గిరీష్, జి.రాములు, కుల నిర్మూలన సంఘం అధ్యక్షుడు వహీద్, గంజి ఈశ్వర్, లింగం, సౌమ్య, జి.యాదగిరిరావు, భాస్కర్, శ్రీమన్నారాయణ, అరుణ పాల్గొన్నారు.

ధన్వంతరి ఫౌండేషన్‌పై చర్యలు తీసుకోవాలి

కాచిగూడ,జనవరి 17: తెలంగాణ ఐఏఎస్ అధికారులను అడ్డం పెట్టుకుని రూ.540 కోట్ల మేరకు అమాయక బ్రాహ్మణులను మోసగించిన ధన్వంతరి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పంతంగి కమలాకర్‌శర్మను చట్ట పరంగా శిక్షించాలని ధన్వంతరి ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ధన్వంతరి ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్‌శర్మకు ఇచ్చిన గడువు నేటితో ముగిసిందని ఆయన గుర్తుజేశారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ధన్వంతరి ఫౌండేషన్ కార్యాలయాన్ని వెంటనే సీజ్ చేయాలని నగర పోలీస్ కమిషనర్‌ను వారు కోరారు.